ఎన్నికలయ్యే వరకూ స్పందన రద్దు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో ప్రతీ వారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు పూర్తియ్యే వరకూ ఈ కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేసినట్లు తెలిపారు కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. **అలాగే** సోమవారం జరగాల్సిన డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను రద్దు చేసినట్లు కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులోకి వచ్చినందున ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాల్సిందిగా కమిషనర్ కోరారు.

తునిలో హోరాహోరీ పోరు..!

- మనుగడ కోసం యనమల..
- హ్యాట్రిక్ విజయం కోసం దాడిశెట్టి..
- గెలుపే లక్ష్యంగా అడుగులు

ప్రజాశక్తి - కోటనందూరు

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడడంతో తుని నియోజవర్గంలో యనమల, దాడిశెట్టి మధ్య పోరు ఉత్కంఠ భరితంగా మారింది. తుని నియోజకవర్గం నుంచి 26 సంవత్స రాలపాటు ఏకచత్రాధిపత్యంగా అసెంబ్లీకి వెళ్లిన టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, వరుసగా మూడు దఫాలు ఓటమిని మూటగట్టుకున్నారు. 2009 లో కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజా అశోక్ బాబు చేతిలో యనమల రామకృష్ణుడు ఓడిపోయారు. తను క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉంటానని తుని నియోజకవర్గము నుంచి పోటీ చేయనని ప్రకటించారు. 2014 జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అభ్యర్థిగా తన సోదరుడైన యనమల కృష్ణుడును బరిలో దింపారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన దాడిశెట్టి రాజా ఆయనపై 10 వేల ఆధిక్యంతో విజయాన్ని అందుకున్నారు. 2019 సంవత్సరంలోనూ యనమల కృష్ణుడు తిరిగి టిడిపి అభ్యర్థిగానే పోటీలో నిలిచారు. అప్పుడూ ఓటమి తప్పలేదు. వరుసగా మూడు పర్యాయాలు యనమల కుటుంబం ఓడిపోవడంతో తుని నియోజక వర్గంపై యనమల కుటుంబ సభ్యులు పూర్తిగా పట్టు కోల్పోయారు. యనమల కుటుంబంపై

దాడిశెట్టి రాజా

యనమల దివ్య

వరుసగా రెండుసార్లు విజయం సాధించిన దాడిశెట్టి రాజాకు సిఎం జగన్మోహన్ రెడ్డి మంత్రి పదవిని ఇచ్చి మంచి గుర్తింపును ఇచ్చారు. దీంతో నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి దాడిశెట్టి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. ప్రజల్లో మంచి పట్టును సాధించారు.

2024 సార్వత్రిక ఎన్నికల్లో 3వసారి దాడిశెట్టి రాజా పోటీలో నిలిచి హ్యాట్రిక్ సాధించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఈ నేపథ్యంలోనే దాడిశెట్టిని ఎట్లాగయినా ఓడించాలన్నా లక్ష్యంతో టిడిపి అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించింది. దాడిశెట్టి సామాజికవర్గానికి చెందిన వ్యక్తినే పోటీలో పెట్టాలనే ఆలోచన చేసింది. టిడిపి, జనసేన కూటమి పక్షాన బలమైన అభ్యర్థిని రంగంలోకి దిచ్చేందుకు పలువురు పేర్లను పరిశీలన చేసింది. అయితే టిడిపి అధినేత చంద్రబాబుకు అంతరంగికుడైన యనమలను కాదనే మరో వ్యక్తికి అవకాశం ఇవ్వడం సరికాదనే భావనతో ఆ ప్రయత్నాన్ని పక్కన పెట్టింది. దీంతో యనమల రామకృష్ణుడు పెద్ద కుమార్తె యనమల దివ్యను తన రాజకీయ వారసురాలుగా ఎన్నికల బరిలోకి దింపారు. వరుసగా మూడవసారి యనమల, దాడిశెట్టి మధ్య తుని నియోజకవర్గంలో ఎన్నికల పోరు రసవత్తరంగా మారనుంది. యనమల రామకృష్ణుడు కుమార్తె విజయం కోసం శక్తి వంచన లేకుండా నియోజకవర్గంలో ఉన్న టిడిపి నాయకులను, కార్య కర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. యనమల రామకృష్ణుడు నేరుగా కార్యకర్తలు, నాయకుల గృహాలకు వెళ్లి పలకరించి తన కుమార్తె విజయానికి సహకరించాలని కోరుతున్నారు. దీంతో కోటనందూరు, తుని పట్టణం, తుని రూరల్, తొండంగి మండలంలో పలు పార్టీలకు చెందిన నాయకులు టిడిపి గూటికి చేరుతున్నారు. దీనికి తోడు మంత్రి దాడిశెట్టి రాజా చిన్ననాటి స్నేహితుడు, 2014, 2019, ఎన్నికల్లో మంత్రి వెనకాల నడిచి పర్సనల్ సెక్రటరీగా పని చేసి వరుసగా రెండు పర్యాయాలు రాజా విజయానికి కృషి చేసిన మోతుకూరు వెంకటేష్ సైతం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమికి తోడు మోతుకూరు వెంకటేష్ రాకతో యనమల దివ్య విజయానికి ఎంతగానో దోహదం చేస్తుందని ఆ పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో జరగనున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో పోరు హోరహోరీగా సాగే అవకాశాలు కన్పిస్తున్నాయి.

ఎలక్టోరల్ బాండ్ల నిధుల వివరాలు వెల్లడించాలి

ప్రజాశక్తి - కాకినాడ

టిడిపి, వైసిపి, జనసేన పార్టీలకు ఎలక్ట్రోరల్ బాండ్లు ఎవరి ద్వారా ఎంత మొత్తం నిధులు అందాయో వివరాలు వెల్లడించాలని సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎలక్ట్రోరల్ బాండ్ల విధానం రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) (ఎ) ప్రకారం వాక్ స్వాతంత్ర్యాన్ని, సమాచార హక్కును ఉల్లంఘిస్తోందని సుప్రీం ధర్మాసనం స్పష్టంగా తన తీర్పులో వెల్లడించిందన్నారు. ఈ బాండ్ల వ్యవహారం అతిపెద్ద స్కామ్ అని, మొత్తం బాండ్లలో సగం రూ.6,565 కోట్లు బిజెపి పార్టీకే అందాయన్నారు. రాష్ట్రంలో వైసిపికి రూ.337 కోట్లు, టిడిపికి రూ.218.88 కోట్లు, జనసేనకు 21 కోట్లు కార్పొరేట్ సంస్థల ద్వారా అందాయని ఎన్నికల కమిషన్ ప్రకటించిన జాబితాలో ఉన్నాయని, మీడియాలో కూడా వచ్చిందని దీనికి ఈ పార్టీలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విశ్వసనీయత, పారదర్శకత, నీతి నిజాయితీ గురించి పదే పదే ప్రస్తావించే జగన్ మోహన్ రెడ్డి బాండ్ల ద్వారా అందిన నిధుల విషయాన్ని ప్రజలకి ఎందుకు చెప్పడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో అవినీతి గురించి, స్కామ్‌ల గురించి జీరో బడ్జెట్ పాలిటిక్స్ గురించి రోజూ మాట్లాడే చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు సమాధానం చెప్పాలన్నారు. దేశవ్యాప్తంగా ఎలక్ట్రోరల్ బాండ్ల వ్యవహారంపై చర్చ జరుగుతుంటే వైసిపి, టిడిపి, జనసేనలు తేలుకుట్టిన దొంగల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ పార్టీల జెండా రంగులే వేరని ఎజెండా ఒక్కటేనని ఆయన దుయ్యబట్టారు. ఎలక్ట్రోరల్ బాండ్లను రద్దు చేయాలని సిపిఎం మొదటి నుంచి పోరాడుతుందని, సుప్రీంలో కేసు వేసి చివరి వరకూ పోరాడిందన్నారు. ఈ బాండ్లు తీసుకోని పార్టీలు వామపక్ష పార్టీలు, సిపిఎం మాత్రమేనని అన్నారు.

దామాషా ప్రకారం బిసిలకు సీట్లు అవసరం

ప్రజాశక్తి - తాళ్లరేవు


శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరరావు

దామాషా ప్రకారం చట్టసభల్లో బిసిలకు సీట్లు కేటాయించాలని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని సుంకరపాలెం పంచాయతీలోని చింతా కుల వారి పేటలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బొంతు శ్రీనివాస రావు ప్రమాణ స్వీకార, అభినందన సభ జరిగింది. బొంతు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ అగ్రవర్ణాల్లో పేదలకు 10 శాతం రిజర్వేషన్ కేటాయించిన నరేంద్ర మోడీ ప్రభుత్వం బిసిలకు పూర్తిస్థాయి రిజర్వేషన్ అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. నేటి సామాజిక రాజకీయ నేపథ్యంలో మారాల్సింది రాజకీయ పార్టీలు కాదని బిసిలే మారాలని అన్నారు. జనాభాలో 60 శాతంగా ఉన్న బిసిలు 10 శాతంగా ఉన్న అగ్ర కులాలకు ఓట్లు వేసుకునే పరిస్థితి రావడం బాధాకరమని అన్నారు. బిసిలు రాజకీయంగా చైతన్య వంతం కావాలని పిలుపునిచ్చారు. లాభాపేక్ష లేకుండా మీకోసం పనిచేసే సంఘాల పిలుపులకు స్పందించాలని కోరారు. బిసిలకు రాజ్యా ధికారం వస్తేనే వాళ్ల జీవితాల్లో మార్పులు వస్తాయని అన్నారు. అందుకు అనుగుణంగానే బిసి శ్రేణులు చైతన్య వంతులు కావాలని పిలుపునిచ్చారు. ఈ సభలో శెట్టిబలిజ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చొల్లంగి వేణుగోపాల్, బిసి సంఘ రాష్ట్ర నాయకుల కె.శివన్నారాయణ, కుమ్మర క్రాంతికుమార్, రాయుడు నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు, ఇంజరం సర్పంచ్ ముద్దన వెంకట శివరామ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పటిష్టవంతంగా ఎన్నికల నిర్వహణ

ప్రజాశక్తి - కాకినాడ

అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ వెంకట్రావు

ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలను పటిష్టవంతంగా నిర్వహిస్తామని అర్బన్ ఎన్నికల అధికారి జె.వెంకటరావు తెలిపారు. ఆదివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై నోడల్ ఆఫీసర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణను 22 బృందాలుగా విభజించి వాటి పర్యవేక్షణ బాధ్యతను నోడల్ అధికారులకు అప్పగించామన్నారు. ఆయా బృందాలు ఎన్నికలకు సమాయత్తం కావడంతోపాటు చేపట్టాల్సిన విధులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, తహశీల్దార్ దొర, ఎన్నికల డిటి సీతాపతిరావు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఇఇ మాధవి, ఎఇ శిరీష్ పాల్గొన్నారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల నేతలు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని కోరారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, జెండాలు, బిల్ బోర్డులు, గోడలపై ప్రచారాలు పూర్తి నిషిద్ధమన్నారు.

వైసిపి విజయ సంకల్పయాత్ర

ప్రజాశక్తి - పెద్దాపురం

సంకల్పయాత్రలో దవులూరి దొరబాబు

వైసిపి నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబు విజయాన్ని కాంక్షిస్తూ విజయ సంకల్పయాత్ర జరిగింది. ఆదివారం సాయంత్రం దొరబాబు పెద్దాపురం మెయిన్ రోడ్‌లో జరిగిన ఈ యాత్ర వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ గతంలో సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో చుట్టూ తిరిగే వారన్నారు. సిఎం జగన్మోహన్ రెడ్డి సచివాలయాలు ఏర్పాటు ద్వారా ప్రజలకు అవస్థలు తప్పించారన్నారు. వృద్ధులు సైతం గతంలో పింఛన్లు తీసుకునేందుకు ఎన్నో అవస్థలు పడే వారన్నారు. మెయిన్ రోడ్‌లో వ్యాపారులను కలిసి వైసిపికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యులు గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిర్యాల రాజా, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, వైసిపి పట్టణ అధ్యక్షులు కాపుగంటి కామేశ్వరరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

టిడిపి శ్రేణులతో మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు

చిలకలూరిపేటకు తరలిన టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - కాకినాడ

టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఆధ్వర్యంలో ఆదివారం చిలకలూరిపేట బహిరంగ సభలో పాల్గొనేందుకు టిడిపి శ్రేణులు కార్లు, బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. ఈ ర్యాలీని మాజీ ఎంఎల్ఎ వనమాడి కొండబాబు ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత ప్రధాని నరేంద్రమోడీ, విజినరీ నాయకుడు చంద్రబాబు, పోరాటయోధుడు పవన్ కళ్యాణ్ నేతృత్వంలో మొట్టమొదటిగా చిలకలూరిపేటలో ఉమ్మడి ప్రజాగళం బహిరంగసభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జగన్ రాష్ట్రంలో అరాచక పాలన సృష్టిస్తూ అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేశాడని, రాబోయే ఎన్నికలలో జగన్‌ని ఓడించకపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. అందువల్లే రాష్ట్ర ప్రజలు టిడిపి, జనసేన, బిజెపి కటమిని అధికారంలోకి తీసుకురావడానికి సిద్ధమయ్యారని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి, సంక్షేమ పాలన ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, గ్రంధి బాబ్జి, నృసింహదేవర విశ్వనాథం, పలివెల రవి, గదుల సాయిబాబా, అంబటి చిన్నా, తుమ్మల రమేష్ పాల్గొన్నారు.

మహిళా జూనియర్ కళాశాలగా జెడ్‌పి పాఠశాల

ప్రజాశక్తి - కాజులూరు

జూనియర్ కళాశాలగా ఉన్నతీకరణ చేసిన ఉన్నత పాఠశాల

మండలంలోని గొల్లపాలెం జడ్‌పి పాఠశాలకు మహిళా జూనియర్ కళాశాలగా పదోన్నతి లభించిందని పాఠశాల హెచ్‌ఎం సుశీలమణి తెలిపారు. ఆదివారం గొల్లపాలెం జడ్‌పి పాఠశాలలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ పాఠశాలను మహిళ జూనియర్ కళాశాలగా పదోన్నతి లభించిందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఈ మేరకు జిఒ విడుదల అయిందని తెలిపారు. జూన్ నెల నుంచి మహిళా జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైపిసి, సిఇసి గ్రూపులను ప్రారంభించినట్లు తెలిపారు. మహిళా జూనియర్ కళాశాల మంజూరు పట్ల జడ్‌పిటిసి సభ్యులు వనుము వెంకట సుబ్బారావు, సర్పంచ్ పోతురాజు ప్రసన్నమౌనిక, ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరి, తహశీల్దార్ శాంతిలక్ష్మి, ఎంపిడిఒ రత్నారాజ్, ఎంఇఒ వివేకనంద, పిఇటి సునీల్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి 10వ తరగతి పరీక్షలు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో సోమవారం నుంచి 10వ తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తియ్యాయి. ఈ నెల 18 నుంచి 30 వరకూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ ఈ పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు జిల్లాలోని 451 పాఠశాలల నుంచి 32,262 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 27,856 మందిలో బాలురు 13,684, బాలికలు 14,172 మంది పరీక్షలు రాయనున్నారు. మిగిలిన వారు సప్లిమెంటరీ విధానంలో పరీక్షలు రాయనున్నారు. జిల్లావ్యాప్తంగా 137 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి.

ఓపెన్ పరీక్షలకు 8,561 మంది

సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యాన జిల్లాలోని 27 కేంద్రాల్లో నిర్వహించే టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు కూడా ఈ నెల 18న ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలు ప్రతి రోజూ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ జరుగుతాయి. పదో తరగతికి 2,067 మంది, ఇంటర్‌కు 6,494 హాజరు కానున్నారు.

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

10వ తరగతి పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లును పూర్తి చేసినట్లు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జెడి నాగమణి తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో అవసరమైన తాగునీరు, ఇతర సౌకర్యాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్లరాదని, ఆఖరికి పరీక్ష కేంద్రాల తనిఖీలకు వచ్చే అధికారులు సైతం తమ ఫోన్లను గది వెలుపలే విడిచిపెట్టి లోపలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. పేపర్ లీకేజీలకు కారకులైన వారిని ఉద్యోగం నుంచి పూర్తిగా తొలగిస్తామని హెచ్చరించారు. ఫీజు బకాయి పేరుతో హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసే పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. పాఠశాలల నుంచి ఇచ్చే హాల్ టికెట్టుతో సంబంధం లేదని, విద్యార్థులు నేరుగా వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకుని పరీక్షకు హాజరు కావచ్చని స్పష్టం చేశారు.

ఓటు సక్రమంగా వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

సమావేశంలో మాట్లాడుతున్న పట్నాయక్

ఓటు అనేది ఒక ఆయుధం వంటిదని దానిని సక్రమంగా వినియోగించుకోవాలని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ సూచించారు. బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ ఓటు దేశ భవిష్యత్తును నిర్దేశిస్తుంది కాబట్టి ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. పేద కుటుంబాలకు చెందినవారు ఈ విషయాన్ని గమనించి నూటికి నూరు శాతం ఓట్లు వేస్తుంటే విద్యావంతులు మాత్రం ఓటు వేయడానికి అశ్రద్ధ చూపుతున్నారని అన్నారు. రాజ్యాంగం పౌరులకు ఓటు ద్వారా గొప్ప బాధ్యతను అప్పగించినందున తమ ఓటును వివేకవంతంగా వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కరప

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

స్థానిక చిరంజీవి కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరాన్ని సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎంపిపి శ్రీలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యులు వై సుబ్బారావు ప్రారంభిం చారు. డాక్టర్ న్యూరో సర్జన్ గౌతమ్ ప్రవీణ్, డాక్టర్ మాత శ్రీనివాస్, చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ సృజన, జనరల్ సర్జన్ డాక్టర్ శిరంగి దొరబాబు, డాక్టర్ అడబాల మాధవి, డాక్టర్ చిట్ల కిరణ్, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ సత్యసుధ, డాక్టర్ పుల్లా ప్రసాద్, డాక్టర్ స్వప్నిక, డాక్టర్ రజినీదీప, డాక్టర్ భీమాల దుర్గాప్రసాద్ వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ బొండ సూర్యారావు మాట్లా డుతూ కీర్తిశేషులు ముమ్మిడి శ్రీరామారావు, డాక్టర్ నున్న నరసింహారావు జ్ఞాపకార్థం ప్రవాస ఆంధ్ర వైద్య నిపుణుల సంఘాల ఆధ్వర్యంలో ఈ మెగా క్యాంపు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పి.తాతీలు రోగులకు బట్టర్ మిల్క్, మంచినీరు అందించారు.

జిల్లాలో ప్రశాంతంగా గ్రూప్-1 పరీక్షలు

ప్రజాశక్తి - కాకినాడ, గండేపల్లి

సూరంపాలెం ఆదిత్యలో పరీక్షలకు హాజరైన విద్యార్థులు

జిల్లాలో గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రెండు సెషన్‌లలో పరీక్షలను నిర్వహించడం జరిగిందన్నారు. గ్రూప్ - 1 పరీక్షల కోసం జిల్లాలో 11 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 6,843 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 4,179 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కాగా, 2664 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకూ నిర్వహించిన రెండో పరీక్షకు 6,843 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి వుండగా 4,169 మంది అభ్యర్థులు హాజరయ్యారని తెలిపారు. 2,674 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. అలాగే ఆదిత్య క్యాంపస్‌లో ఆదివారం ఉదయం మరియు సాయంత్రం జరిగిన ఎపిపిఎస్‌సి గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఆదిత్య ఇంజనీరింగ్ క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆదిత్య యాజమాన్యం అన్ని ఏర్పాట్లను చేసిందన్నారు.

కార్టూ'నిజం'

ఎన్ని కోర్సులున్నా చివరికి
ఈ కోర్సులు తప్పడం లేదురా..!!

పవన్‌ను గెలిపించుకుందాం: వర్మ

ప్రజాశక్తి - పిఠాపురం

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నేత వర్మ

టిడిపి అధినేత చంద్రబాబు తనకు హామీ ఇచ్చారని, కావున ఆయన ఆదేశాల మేరకు రాబోయే ఎన్నికల్లో పవన్ కళ్యాణ్‌ను గెలిపించుకుందామని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్ఎస్.వర్మ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పిఠాపురం సీటు విషయంపై చంద్రబాబు నాయుడును కలిశామన్నారు. రాష్ట్రంలో కుటుంబం మొత్తం టిడిపికి సేవ చేసినది ఏదన్నా ఉందంటే వర్మ ఫ్యామిలీయే అని చంద్రబాబు అన్నారన్నారు. 2014లో ఒకసారి సీటు ఆశించినా రాలేదని అలాంటి అన్యాయం మళ్లీ జరగకూడదని చివరి నిమిషం వరకు తన ప్రయత్నం చేసినట్లు చంద్రబాబు తెలిపారని చెప్పారు. పొత్తులో భాగంగా ఒక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అక్కడి నుంచి పోటీ చేస్తానంటే పొత్తు ధర్మంలో భాగంగా కాదనలేకపోయానని, అందుకే అధికారం చేపట్టిన వెంటనే ఎంఎల్‌సి పదవి ఇస్తానని హామీ ఇచ్చారని వివరించారు. తాను సీటు రాకపోయినా పదవులు కోరుకోలేదని పురుషోత్తంపట్నం ఎత్తిపోతల పథకం, ఏలేరు సెకండ్ పేజ్ ఆధునీకరణ, ఉప్పాడ జియో ట్యూబ్, తడవకు తరలిపోతున్న మూడు టిఎంసిల నీటిని పిఠాపురం రైతులకు అందించాలని కోరినట్లు తెలిపారు. అధినేతకు తగిన గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని, రాబోయే ఎన్నికల్లో టిడిపి శ్రేణులంతా పవన్‌ను గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మన సైకిల్ మీద మనం తిరుగుతూ ఎన్నికల్లో గ్లాసు గుర్తుపై ఓటు వేసి పవన్‌ను గెలిపించి తర్వాత మన సైకిల్‌పై మనం తిరుగుదామన్నారు. టిడిపి కార్యకర్తలపై కవ్వింపు చర్యలకు ప్రయత్నం చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు అల్లుమలు విజయకుమార్, మాజీ జడ్‌పిటిసి బర్ల అప్పారావు, పిల్లి చిన్న, కొండేపూడి ప్రకాష్, మూడు మండలాలు, రూరల్ టిడిపి అధ్యక్షులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు

వాహనాలను తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఎన్నికల కోడ్ రావడంతో ఉప్పాడ రింగ్ రోడ్డు సెంటర్లో కొత్తపల్లి పోలీసులు ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. కొత్తపల్లి ఎస్ఐ స్వామి నాయుడు పర్యవేక్షణలో ఉప్పాడ బీచ్ రోడ్డుపై వెళ్తున్న కారులను, ద్విచక్ర వాహనాలు నిలుపుదల చేసి క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఆయా కార్లు, ఇతర వాహనాల్లో నగదును తరలిస్తే సరైన పత్రాలు చూపించాలని లేనిపక్షంలో నగదును జిల్లా కమిటీకి అప్పగించడం జరుగుతుందనిపోలీసులు తెలిపారు. రూ.50 వేలకు మించి నగదును తీసుకువెళ్తే వాటికి సంబంధించిన పత్రాలను చూపించాలని తెలిపారు. ఉప్పాడలో చీరలు కొనుగోలుకు వచ్చేవారు సంబంధిత రశీదులను చూపితే సరిపోతుందన్నారు.

10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - సామర్లకోట

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ శివరామకృష్ణయ్య

మండలంలో 10వ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంఇఒ వై.శివరామకృష్ణయ్య తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. మండలంలో 9 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహణ ఉంటాయని తెలిపారు. మండలంలోని 6 జడ్‌పి ఉన్నత పాఠశాలలు, ఒక ప్రభుత్వ, ఒక మున్సిపల్ పాఠశాలతోపాటు, ఒక ప్రయివేటు పాఠశాలను పరీక్షలు నిర్వహణకు ఎంపిక చేసినట్లు తెలిపారు. మొత్తం 2,205 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని వివరించారు. వీరిలో 1620 మంది రెగ్యులర్ విద్యార్థులు కాగా, 585 మంది ప్రయివేటు విద్యార్థులు ఉన్నారని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సిఎస్ఇ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకున్న హాల్ టికెట్‌తోనే పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు.

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన కారు

-ఒకరి మృతి, నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక జాతీయ రహదారిపై ఆదివారం మోటార్ సైకిళ్ళను వెనక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టిన సంఘటనలో ఒకరు మృతిచెందగా నలుగురు గాయాల పాలయ్యారు. ఈ మేరకు ప్రతిపాడు ఎస్ఐ ఎం పవన్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలం లోని ఉత్తర కంచికి చెందిన తాడి గంగాధర్(29) సోదరుడు తాడి రాజేష్, గుడాల సురేష్ ప్రత్తిపాడు వచ్చే నేపథ్యంలో హైవేపై మోటార్ సైకిల్‌పై వస్తున్నారు. వీరి వెనక గొల్లప్రోలు మండలం వెల్దుర్తికి చెందిన సోదరులు ములికి సత్యనారాయణ, ములికి ఉమాశంకర్‌లు మరో బైకుపై వస్తున్నారు. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి రెండు మోటార్ బైక్ లను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స అందించే క్రమంలో పరిస్థితి విషమించి తాడి గంగాధర్ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలం యండగండిలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు చేశామని ఎస్ఐ జానీ భాషా తెలిపారు. మద్యం విక్రయిస్తున్నారని సమాచారంతో యండగండి గ్రామ శివారు పొలాల వద్ద యండగండికి చెందిన కడలి శ్రీనివాసు యానంకి చెందిన వివిధ కంపెనీలకు చెందిన 14 మద్యం బాటిల్స్‌ను విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేకాడుతున్న ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి - కడియం

పేకాడుతున్న ఐదుగురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. కడియం సిఐ బి.తులసీధర్ ఆధ్వర్యంలో ఎస్ఐ టి.కృష్ణసాయి, సిబ్బందితో కడియం గ్రామ శివారు సంగీత నర్సరీ మొక్కల్లో పేకాడుతుండగా అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3,140 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

కోడ్ కూసింది.. ఫ్లెక్సీ ఊడింది..

గోపాలపురంలో విగ్రహానికి ముసుగు తొడిగిన సిబ్బంది

ప్రజాశక్తి- యంత్రాంగం

పెరవలి సార్వత్రిక ఎన్నికల గంట మొగడంతో అధికార యంత్రాంగం రాజకీయ పార్టీలు సంబరానికి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే గత నెల రోజుల నుంచి అధికార యంత్రాంగం ఎన్నికల సంబంధించిన ఏర్పాటులో నిమగ్నమయ్యారు. కేంద్ర ఎన్నికల సంఘం శనివారం ఎన్నికల తేదీ ఖరారు చేయడంతో మరింత అప్రమత్తమయ్యారు. నియోజక వర్గ పరిధిలో సౌకర్యాలపరంగా లోటు పాట్ల వైపు ప్రత్యేక దృష్టి పెట్టారు. మరొకపక్క తుది ఓటర్లు జాబితాపై కసరత్తు కొనసాగుతోంది. నియోజవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు సిబ్బందికి శిక్షణ పూర్తి చేశారు. ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో రాజకీయ పార్టీలు ఫ్లెక్సీలు బ్యానర్లు పోస్టర్లు 24 గంటల్లోపు స్వచ్ఛందంగా తొలగించాలని అధికారులు ఆదేశించారు. దీంతో కొందరు వాటిని స్వచ్ఛంగా తొలగించి జాగ్రత్త చేసుకున్నారు. మున్సిపాలిటీ మండల స్థాయి, గ్రామస్థాయిలో కోడ్ ఉల్లంఘనకు అవకాశం లేకుండా పంచాయతీ కార్యదర్శి విఆర్ఓ స్థానిక మహిళా పోలీసులతో ఆయా ప్రాంతాల్లో రాజకీయ నాయకులు ఫ్లెక్సీల తొలగింపు రాజకీయ, జాతి నాయకులు విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు.

చాగల్లు ఎన్నికల గంట మొగడంతో అధికార యంత్రాంగం రాజకీయ పార్టీల ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్లు 24 గంటల్లోపు స్వచ్ఛందంగా తొలగించాలని అధికారులు ఆదేశించారు. దీంతో కొందరు వాటిని స్వచ్ఛంగా తొలగించి జాగ్రత్త చేసుకున్నారు. మున్సిపాలిటీ మండల స్థాయి గ్రామస్థాయిలో కోడ్ ఉల్లంఘనకు అవకాశం లేకుండా పంచాయతీ కార్యదర్శి విఆర్ఓ స్థానిక మహిళా పోలీసులతో ఆయా ప్రాంతాల్లో రాజకీయ నాయకులు ఫ్లెక్సీల తొలగింపు రాజకీయ జాతి నాయకులు విగ్రహాలకు ముసుకులు వేస్తున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఇప్పటికే మండల స్థాయిలో సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక దళాలతో కవాతు నిర్వహించారు. రాజకీయ పార్టీలు ఊహలకు పదులు పెడుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో నిత్యం ప్రజలలో ఉండేలా ప్రణాళికలు రూపొం దిస్తున్నారు

గోపాలపురం రెవెన్యూ, పంచాయతీ, సిబ్బంది రాజకీయ పోస్టర్లు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేస్తున్నారు. ఎన్నికల కోడ్ మేరకు 24 గంటలు లోపే బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్లలో విద్యుత్ స్తంభాలు, ప్రభుత్వ బస్సులు, రోడ్డు, వంతెనలు, ప్రభుత్వ కార్యాలయాలు, మండల పరిధిలో ఉన్న అన్ని రకాల రాజకీయ పరమైన ఫ్లెక్సీలు, బ్యానర్లు, తొలగింపుకు చర్యలు చేపట్టారు.

గ్రామాల్లో పోలీసుల కవాతు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

సార్వత్రిక ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలో ఎన్నికల కోడ్ అమలు జరుగుతోంది. సెంట్రల్ ఆర్మీ పోలీస్ ఫోర్సు బలగాలతో మండలంలోని చివటం, పాలంగి, కె.సావరం, ఉండ్రాజవరం గ్రామాల్లో ఆదివారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వి.అప్పలరాజు మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా, తమ ఓటు హక్కు ఉపయోగించుకోవచ్చునని, ఎన్నికల వేళ ఎటువంటి అసాంఘిక చర్యలు, అవాంఛిత సంఘటనలు జరుగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించడానికి పోలీసు వ్యవస్థ సిద్ధంగా ఉందన్నారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురికాక తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు పోలీసు వ్యవస్థ అండగా ఉంటుందన్నారు. ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా ముందస్తుగా కవాతు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పోలీసులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, బ్యానర్లు, పోస్టర్ల తొలగింపు

ప్రజాశక్తి - కాకినాడ, సామర్లకోట

అర్బన్ నియోజకవర్గ పరిధిలో వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది. డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్ పర్యవేక్షణలో సిబ్బంది డివిజన్ల వారీగా గోడలపై ఉన్న పోస్టర్లు, ఫ్లెక్సీలు, బ్యానర్లను తొలగిస్తున్నారు. ఈ ప్రక్రియను నగర పరిధిలో మూడు ప్రత్యేక బృందాలు పర్యవేక్షిస్తున్నాయి.

సామర్లకోటలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న సిబ్బంది

ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్‌కు సంబంధించిన బృందాలు జోక్యం చేసుకుని ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తున్నాయి. ఈ సందర్భంగా డిసిపి హరిదాసు మాట్లాడుతూ కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలో చాలావరకు ప్రచార పోస్టర్లు, బ్యానర్లు, హోర్డింగ్‌ను తొలగించామని, జాతీయ నాయకుల విగ్రహాలు మినహా రాజకీయ పార్టీల నాయకులకు సంబంధించిన విగ్రహాలకు మాస్కులు వేస్తున్నామన్నారు. నగర పరిధిలో సుమారు 40 నుంచి 50 వరకు విగ్రహాలు ఉంటాయన్నారు. రాజకీయ పార్టీలు కూడా మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను కచ్చితంగా అమలు చేయడంలో సహకరించాలని కోరారు. అలాగే సామర్లకోట పట్టణంలోని పలు రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించే కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. పట్టణంలో విద్యుత్, టెలిఫోన్ స్తంభాలతోపాటు, ప్రభుత్వ స్థలాల్లో, బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకున్న ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జె.రామారావు మాట్లాడుతూ ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున వివిధ రాజకీయ పార్టీలు ఎలక్షన్ కోడ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. ఫ్లెక్సీలను ఆయా రాజకీయ పార్టీలకు చెందిన వారే స్వచ్ఛంధంగా తొలగించాలని సూచించారు.

కాకినాడలో ఫ్లెక్సీలను తొలగిస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది

డాక్టర్ తరపట్లకు సాహితీ పురస్కారం

నన్నయ విసి, రిజిస్ట్రార్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న తరపట్ల సత్యనారాయణ

ప్రజాశక్తి - రాజానగరం

కుసుమ ధర్మన్న జయం తోత్సవ వేడుకల్లో నన్నయ విశ్వ విద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ తరపట్లకు సాహితీ పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని యూని వర్శిటీ విసి ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్యజి.సుధాకర్, కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యఓఉలు డాక్టర్ రాధా కుసుమ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్య క్రమంలో నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టర్. ఆచార్య. పి.వరప్రసాద్ మూర్తి, మద్రాస్ విశ్వవిద్యాలయం ఆచార్యులు విస్తాలి శంకర్, ఆంధ్ర విశ్వ విద్యాలయ ఆచార్యులు.డాక్టర్ బి.వెంకటస్వామి.పాల్గొన్నారు.

స్నేహితుని జ్ఞాపకార్థం సేవలు

ప్రజాశక్తి - సామర్లకోట

మూడేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తన స్నేహితుడు జ్ఞాపకార్థం సేవా కార్య క్రమాలను నిర్వహిస్తున్నాడు ఓ స్నేహితుడు. మండలం లోని వెదురుపాక శివ, సామర్లకోటకు చెందిన లంక శ్రీనివాసు మంచి స్నేహితులు. గత 3 సవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో లంక శ్రీనివాసు మృతి చెందాడు. తీవ్ర భావోద్వేగానికి గురైన శివ తన స్నేహితుని జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చెయ్యాలని నిర్ణయించుకుని గత రెండేళ్లుగా స్నేహితుని పుట్టిన రోజున పలువురికి నిత్యవసర సరుకులు అందించడం ప్రారంభించాడు. ఈ నేపథ్యంలోనే ఆదివారం రెండు నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులతోపాటు 26 కేజీల బియ్యం బస్తాను అందచేశారు. శివ చేస్తున్న సేవా కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.

వృద్ధిరాలికి బియ్యం, నిత్యవసర సరుకులు అందిస్తున్న మిత్రులు

ఘనంగా పోలేరమ్మ తీర్థం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పోలేకుర్రు గ్రామ దేవత పోలేరమ్మ 18వ ఆలయ వార్షికోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలమాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి పాలాభిషేకం చేశారు. అనంతరం అనేకమంది మహిళలు సామూహిక కుంకుమ పూజలు భక్తి, శ్రద్ధలతో చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా వందలాదిమందికి అన్న ప్రసాద వితరణ చేశారు. పోలేకురు, తోటపేట, తాళ్లరేవు, పి. మల్లవరం, పత్తిగొంది, సుంకటరేవు, యానం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా మురమళ్ళ భజన బృందం ఆధ్వర్యంలో భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

సుబ్బరాజు, హరీష్‌ల గెలుపు అవసరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎంఎల్ఏగా దాట్ల సుబ్బరాజు, ఎంపీగా గంటి హరీష్ మాధుర్‌లు గెలుపు అవసరమని తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ అన్నారు. ఆదివారం తాళ్లరేవులో టిడిపి గ్రామ అధ్యక్షుడు కుడిపూడి రామకృష్ణ ఆధ్వర్యంలో ఇంటి ఇంటికి వెళ్లి టిడిపి ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న సుబ్బరాజు, హరీష్ మాధూర్‌లను గెలిపించాలని కోరారు. చంద్రబాబును సిఎంగా చేసుకోవడం ద్వారా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రోళ్ళ చక్రవర్తి, గంజా సూరిబాబు, నడింపల్లి వినోద్, మేడిశెట్టి సత్తిబాబు, కుడిపూడి దుర్గా ప్రసాద్, బండారు శ్రీను, వాకపల్లి చిరంజీవి పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

యానాం వార్తలు

మునిస్వామితో మాట్లాడుతున్న వైద్యనాథన్, సత్తిబాబు, దినేష్

తాగు, సాగి నీటి సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - యానాం

రైతులకు, ప్రజలకు తాగు, సాగు నీటి ఇబ్బందులు ఎదురవ్వకుండా చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామిని పుదుచ్చేరి సిఎల్‌సి నేత, ఎంఎల్ఏ వైద్యనాథన్ కోరారు. ఆదివారం స్థానిక కనకాలపేటలోని డంపింగ్ యార్డ్ పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి, మార్చురీ విభాగం, సిటీ స్కానింగ్ ఎక్స్‌రే, జనరేటరు, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై చర్చించారు. అలాగే గోపాల్ నగర్‌లో ప్రజలకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న డంపింగ్ యార్డ్ రీసైక్లింగ్ స్థలంను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో యానాం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్‌ఛార్జ్ మల్లాడి సత్తిబాబు, కాటంశెట్టి రామ్మూర్తి, కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షులు అర్దాని దినేష్, పెరిమాళ్, దున్నా చక్రవర్తి, బంగారం, మున్నా, గణేష్ పాల్గొన్నారు.

36 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న మునిస్వామి

ప్రజాశక్తి - యానాం

ఏప్రియల్ 19న జరిగే లోక్ సభ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి యానాంలో 3 మోడల్ పోలింగ్ బూత్‌లతో కలిపి 36 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పరిపాలనాధికారి ఆర్.మునిస్వామి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో స్త్రీ, పురుషులు కలిపి మొత్తం గా 39 వేల 400 మంది ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. డాక్టర్ జాకీర్ హుస్సేన్ ప్రభుత్వ ఇంగ్లీషు మీడియం ప్రైమరీ పాఠశాలలో(తూర్పు వైపు) మోడల్ పోలింగ్ బూత్‌ను మహిళలు నిర్వహిస్తారన్నారు. అలాగే అంబేద్కర్ నగర్‌లోని దున్నా నాగారావు ప్రభుత్వ పాఠశాలలో(ఉత్తరం వైపు) పోలింగ్ బూత్‌ను యువత నిర్వహిస్తారన్నారు. అలాగే స్థానిక మినీ సివిల్ స్టేషన్ లోని పోలింగ్ బూత్(తూర్పు వైపు)ను వికలాంగులు నిర్వహిస్తారన్నారు. మూడు ప్లైయింగ్ తనిఖీ బృందాలను, అలాగే వీడియో నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సెక్టార్ అధికారులను నియమించడం జరిగిందన్నారు.

క్రిస్టియన్ మైనారిటీ సెల్ సెక్రటరీగా జానీ మోసెస్

జానీ మోజేష్‌ను సత్కరిస్తున్న దవులూరి దొరబాబు

ప్రజాశక్తి - సామర్లకోట

వైసిపి క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర సెక్రటరీగా సామర్లకోట పట్టణానికి చెందిన మైలాభత్తుల జానీ మోజెష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన ఆదివారం వైసిపి పెద్దాపురం నియోజకవర్గ అభ్యర్థి దవులూరి దొరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దొరబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. క్రిస్టియన్ మైనార్టీ ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని దొరబాబును ఆయన కోరారు. ఈ సందర్భంగా జానీ మోసెస్‌ను దొరబాబు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పిల్లి సూర్యప్రకాష్

వైసిపి విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

వైసిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పార్టీ విజయానికి కృషి చేయాలని వైసిపి ఇన్చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. కె. గంగవరం మండలంలో పార్టీ విస్తత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చమని మీకు మంచి జరిగితేనే పార్టీకి ఓటు వేయాలని గ్రామస్థాయిలో ఓటర్ లకు తెలియజేయాలన్నారు. వచ్చే పార్టీల అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని ప్రజలు గమనిస్తారని ఆయన వివరించారు. కార్యక్రమంలో.మండల పార్టీ అధ్యక్షులు పెట్టా శ్రీనివాస్, ఎంపిపి పంపన నాగమణి సుబ్బారావు, మండల సచివాలయ కన్వీనర్ తోకల శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడు జుత్తుక శ్యాం ప్రసాద్, వైస్ ఎంపీపీలు, సర్పంచ్లు, ఎంపిటీసీలు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు నూకాంబిక జాతరపై సమీక్ష

ప్రజాశక్తి-ఆలమూరు

మండలంలోని చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆర్‌డిఒ ఎం.ముక్కంటి ఆధ్వర్యంలో ఈనెల 18న సాయంత్రం 4 గంటలకు జాతరపై సమీక్ష నిర్వహించనున్నారని ఆలయ ఇఒ ఎం.శివరామకృష్ణ ఆదివారం తెలిపారు. ఈ సమీక్షలో అన్ని శాఖల అధికారులు పాల్గొని సహకరించాలన్నారు. అలాగే గ్రామస్తులు, పాత్రికేయులు విచ్చేసి తమ తమ అభిప్రాయాలు తెలియజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ భాస్కర్ శ్రీనివాస్ ఉన్నారు.

శివరామకృష్ణ, ఇఒ

వైసిపి రాష్ట్ర కమిటీలో 8 మందికి పదవులు

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

వైసిపి రాష్ట్ర కమిటీలో డా.బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన ఎనిమిది మంది నేతలకు పదవులు దక్కాయి.వీరిలో వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా అమలాపురం పట్టణం నుంచి చెల్లుబోయిన శ్రీనువాసరావు, బండారులంక గ్రామానికి చెందిన ఆ గ్రామ ఉపసర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు నియమితులయ్యారు. రాష్ట్ర కమిటీల్లో ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన వీరు ఇప్పటి వరకూ పార్టీలో వివిధ పదవులు నిర్వహిస్తున్నారు. వీరు ఆదివారం రాష్ట్ర రవాణా శాఖామంత్రి పినిపే విశ్వరూప్ ను బట్నవెల్లి క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ కామిశెట్టి శ్రీనివాసరావును అభినందించి ఘనంగా సత్కరించారు. త్వరలో జరుగబోయే ఎన్నికల్లో వైసిపి విజయానికి కృషిచేస్తామని కొత్తగా పదవులు పొందిన నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బండారులంక గ్రామానికి చెందిన వైసిపి నాయకులు హాజరయ్యారు.

భిన్నంగా 'అవును నిజమే' చిత్రం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

సత్య శ్రీ క్రియేషన్ బ్యానర్ పై తీస్తున్న అవును నిజమే సినిమా అన్ని సినిమాలకన్నా భిన్నంగా హాస్య భరితంగా ఉంటుందని చిత్ర నిర్మాత వరసాల సత్యనారాయణ తెలిపారు. చల్లపల్లి పంచాయతీ చింతల చెరువుకు చెందిన చిత్ర నిర్మాత సత్యనారాయణ ఆదివారం ఆయన స్వగృహం వద్ద చిత్ర యూనిట్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సినిమా హైదరాబాద్, కాకినాడ, ఫ్రెంచ్ యానాం, అమలాపురం పరిసర ప్రాంతాల్లో షఉటింగ్ తీయడం జరిగిందని తెలిపారు. చిత్రంలో నూతన నటీనటులు హీరో విఎస్ఎన్, హీరోయిన్ అనూష లతోపాటు జబర్దస్త్ టీం కూడా నటిస్తున్నారని తెలిపారు. చిత్రానికి దర్శకత్వం గూన అప్పారావు, కెమెరామెన్ వెంకటాద్రి నాయుడు, సంగీతం రాజేష్, కొరియోగ్రఫీ బండ్ల రామారావు, పాటలు పవన్ శంకర్ రచించారని తెలిపారు. మే నెలలో సినిమా విడుదలకు సన్న హాలు చేస్తున్నామని సత్యనారాయణ తెలిపారు.

మాట్లాడుతున్న నిర్మాత సత్యనారాయణ

ఘనంగా స్వర్ణ శిఖర ప్రతిష్ట

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ స్వర్ణ శిఖర ప్రతిష్ట ఆదివారం అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు . ఆలయ ప్రాంగణంలో క్షేత్రపాలకుడు కాశీ విశ్వేశ్వర స్వామి, గోపాలస్వామి, మహాలక్ష్మి అమ్మవారికి స్వర్ణకలశ ప్రతిష్ట జరిగింది. కార్యక్రమాలు ఎంఎల్ఏ చిర్ల జగ్గి రెడ్డి సహకారంతో ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్ భూపతి రాజు వెంకట సత్య కిషోర్ కుమార్, ధర్మకర్తల మండల సభ్యులు వెంకటేశ్వరరావు శన గన సత్యనారాయణ ఉపసర్పంచ్ పోతు రాజుబాబురావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-కొత్తపేట

అనకాపల్లిలో ఈనెల 25 నిర్వహించే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు తొమ్మిది మంది విద్యార్థులు ఎంపిక అయ్యారని యోగా గురువు రాష్ట్రపతి అవార్డు గ్రహీత ఇంటర్నేషనల్ జడ్జి మోటూరు భైరవ స్వామి ఆదివారంఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వివేకానంద యోగా ఆశ్రమం యోగా గురువు వాడపాలెం పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యోగా శిక్షణ తరగతుల్లో శిక్షణ పొందుతున్నారని అన్నారు. అమలాపురం కామాక్షి పీఠంలో ఫిబ్రవరి 10న జరిగిన యోగా పోటీల్లో విజయం సాధించి రాష్ట్రస్థాయి లో ఈ నెల 25న ఈ విద్యార్థులను యోగా గురువు శ్రీనివాస్ తీసుకు వెళ్తున్నారని అన్నారు. విద్యార్థులను బండారు సందీప్, ఆర్యవైశ్య కళ్యాణ మండపం శ్రీ ఘాకోళ్ళపు వీరబాబు అభినందించారు.

ఎన్నికల్లో పోటీకి సిద్ధం

కాంగ్రెస్ పార్టీ నేత దేవరపల్లి

ప్రజాశక్తి -అమలాపురం రూరల్

కాంగ్రెస్ పార్టీ తనకు అవకాశం ఇస్తే అమలాపురం ఎంపీ అభ్యర్థిగా గాని, అసెంబ్లీ అభ్యర్థిగా గాని ఎన్నికల బరిలో దిగటానికి సిద్ధంగా ఉన్నానని న్యాయవాది దేవరపల్లి రాజేంద్ర బాబు ఆదివారం మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా బయోడేటాని పార్టీ పెద్దలకు తెలియజేశానని తెలిపారు. రాజకీయ కుటుంబానికి చెందిన తాను లా అభ్యసించిన అనంతరం కాంగ్రెస్ పార్టీలో వివిధ బాధ్యతలు స్వీకరించానని అన్నారు. తనకు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే గెలిచే అవకాశం ఉందని దేవరపల్లి రాజేంద్ర బాబు తెలిపారు.

ముమ్మిడివరం రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా రామకృష్ణ

ప్రజాశక్తి-ముమ్మిడివరం

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ముమ్మిడివరం నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా దడాల రామకష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం.రుషి తెలిపారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు అవరణలో ఆదివారం జ్ఞాన ప్రకాష్ అధ్యక్షతన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. రుషి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అంబేఆద్కర్ చే స్వయంగా స్థాపించిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సిద్ధాంతాలను, అశయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఉన్నత విద్యావంతుడు,విశ్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్ దడాల రామకష్ణ ను నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని అన్నారు. రామకష్ణ గెలుపుకు కార్యకర్తలంతా సమిష్టిగా కషి చేయాలని సమావేశం తీర్మానించింది. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బళ్ల సత్యనారాయణ, పెనుమాల సుధీర్, సఖీలే పధ్వీరాజ్, మోకా బాలయ్య, చికురుమిల్లి చిరంజీవి, ఇవివి.సత్యనారాయణ, యలమంచిలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒరిజినల్ లింక్ దస్తావేజు పోయినది

తూర్పు గోదావరి జిల్లా, రాజమండ్రి అర్బన్, డోర్ నెంబర్ 73-8-12/2b, రావిపాటి కొండల రావు వీధి, సత్తెమ్మ తల్లి గుడి, నారాయణపురం లో నివాసం ఉంటున్న మద్దినేని వీర రాఘవయ్య గారి భార్య మద్దినేని లోకేశ్వరి @ గుడే లోకేశ్వరి, (age 41 yrs) అను నేను ది. 14-03-2024న మధ్యాహ్నం 01.30 ని.లకు రాజమండ్రి లోని V.L.పురం నుండి రామాలయం సెంటరు మధ్యలో జిరాక్స్ తీసుకొనుటకు జిరాక్స్ షాప్ దగ్గరకు వెళ్తుండగా బయట రోడ్ మీద నా ఆస్తికి సంబందించిన లింక్ దస్తావేజు ఉన్న బిస్కెట్ రంగు జిప్ బాగ్ పడిపోయినది. రోడ్ దాటేముందు బాగ్ నా దగ్గరే వుంది కానీ షాప్ దగ్గరకు వెళ్ళి చూసే సరికి లేదు. అందులో నా ఆస్తికి సంబందించిన ఒరిజినల్ లింక్ దస్తావేజు ఉన్నది. ఆ దస్తావేజు నెంబర్ 1297/1984, తేది.27-2-1984, SRO, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లాకు సంబందించినది ఉన్నది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రెస్ కు తెలియపరచవలసినదిగా కోరుచున్నాను.

Maddineni Lokeswari @ Gude Lokeswari,
W/o.Maddineni Veera Raghavayya,
Door No.73- 8-12/2b, Ravipati Kondalara Rao Street, Sattemmatalli Gudi, Narayana puram,
Rajamahendravaram Urban,
East Godavari Dist. Cell: 9866605444.

లింకు దస్తావేజు వడిపోయినది

కాకినాడ జిల్లా, సామర్లకోట మండలం, ఉండూరు గ్రామం, రామారావుపేట, డోర్ నెం.4-105కు చెందిన యాండ్రపు జోగారావు (లేటు) గారి భార్య యాండ్రపు అప్పలరాజు వల్లీ పద్మ కు చెందిన మండలంలోని ఉండూరు గ్రామంలో సర్వే నెం.118/1, వార్డు నెం.4లో ప్లాటు నెం.7 లో 97 చ.గ.లు కు చెందిన ఖాళీ స్థలంకు చెందిన ఒరిజనల్ లింకు దస్తావేజు నెం. 776/1988 ది. 29.02.2024 నాడు సామర్లకోట లో జిరాక్సు తీయించుకొనుటకు వెడుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. కావున సదరు దస్తావేజు ఎవరికైనా దొరికిన ఎడల క్రింది చిరునామాకు అందచేయమని కోరుతున్నాను.

యాండ్రపు అప్పలరాజు వల్లీ పద్మ, వై/ం.జోగారావు (లేటు),
డోర్ నెం. 4- 105,ఉండూరు గ్రామం,
సామర్లకోట మండలం, కాకినాడ జిల్లా
సెల్ : 9640 417711.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్
(A Government undertaking sponsored by Union Bank of India)
డో.నెం. 6-418, అరవింద్ నగర్, మోరంపూడి, రాజమండ్రి రూరల్, తూ॥గో॥జిల్లా

మోరంపూడి శాఖ - బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మా శాఖలో తీసుకున్న ఋణములు ఎన్ని విధములుగా మీకు సమాచారం పంపిననూ దిగువ తెలిపినవారు తమ బాకీలను చెల్లించియుండలేదు. ఋణం చెల్లించవలసిన కాలం గడిచినందున ప్రధాన కార్యాలయం వారి ఉత్తర్వుల మేరకు సదరు బంగారు నగలను **ది. 27-03-2024 బుధవారం మ॥ గం॥ 3.00లకు** ఈ మోరంపూడి శాఖ ఆవరణలో బహిరంగ వేలం వేసి వారి పేరునున్న బకాయిలు జమ కట్టుకొనుటకు నిర్ణయించడమైనది. వేలములో పాల్గొనదలచినవారు **ది. 27-03-2024 మ॥ గం॥ 1.00 లోపు రూ. 5,000/- అడ్వాన్సుగా చెల్లించవలయును.** ఎట్టి కారణము చూపకనే వేలమును రద్దు చేయుట గాని, వాయిదా వేయుట గాని బ్యాంక్ వారికి పూర్తి అధికారం కలదు. వేలం వేసిన బకాయిలు రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయిలు వసూలు చేయబడును. మరియు వేలం తదితర ఖర్చులు వారి ఖాతాలకు వ్రాయబడును. ఈదిగువ పేర్కొనబడిన ఖాతాదారులలో ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం వర్తిస్తుంది. నోటీసులు తిరస్కరించిన వారికి పత్రికాముఖంగా చివరిగా తెలియజేయడమైనది.

మోరంపూడి శాఖ, తూర్పుగోదావరి జిల్లా, వేలం తేది: 27-03-2024 సమయం గం॥ 3.00లకు

క్ర.సం.	అప్పు ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు, చిరునామా	నికర తూకం గ్రా॥
1.	718030100050516	వడ్డి రాజేష్, R/o. మోరంపూడి	9.0
2.	718030100051542	వడ్డి రాజేష్, R/o. మోరంపూడి	7.0
3.	718030100061424	నగుమల్లి శివప్రియ, R/o. మోరంపూడి	3.0
4.	718030100061433	శృంగవరపు రమేష్, R/o. మోరంపూడి	3.6
5.	718030100061488	గెడ్డం ప్రసాద్, R/o. పిడింగొయ్యి	1.8
6.	718030100066304	నగుమల్లి శివప్రియ, R/o. మోరంపూడి	12.0

మోరంపూడి
17-03-2024
బ్రాంచి మేనేజర్
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, మోరంపూడి, సెల్: 9100903271